సాక్షి
కామారెడ్డి
శనివారం । 11 । అక్టోబర్ । 2025



ఈ రోడ్లకు మోక్షమెప్పుడో..?
బాన్సువాడ, బీర్కూర్ మండలాల్లోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారడంతో బస్సులు ఆయా ఊర్లకు రాని పరిస్థితి నెలకొంది.
- 9లో ▸



నిర్లక్ష్యంపై ఉపేక్షించేది లేదు
సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ నారాయణ అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /18.7

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. అక్కడక్కడ మబ్బులు ఏర్పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నల్గొండ జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజర్‌గా ఇంద్రకరణ్‌రెడ్డి



భిక్కనూరు: నల్గొండ జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజర్‌గా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన పీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. నల్గొండ జిల్లాలో కాంగ్రెస్ నూతన కమిటీలను ఏర్పాటు చేసే బాధ్యతను ఆయనకు అప్పగించారు. పార్టీ కార్యక్రమాలను సమన్వయ చేయాలని పార్టీని మరింత బలోపేతం చేయాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పార్టీని నల్గొండ జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషిచేస్తానన్నారు.

ఆదిలాబాద్-నిర్మల్ జిల్లా పరిశీలకులుగా 'గడ్డం'



కామారెడ్డి అర్బన్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పార్టీ పరిశీలకులుగా నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, కమిటీల నియామకం, సమన్వయం బాధ్యతలను ఆయనకు అప్పగించారు. చంద్రశేఖర్‌రెడ్డి నియామకంపై కామారెడ్డి పట్టణానికి చెందిన పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

14న బ్యాంక్ జాబ్ మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 14న బ్యాంకింగ్ రంగంలో శాశ్వత ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 26 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలని, ఏదేని డిగ్రీ, బీటెక్‌లో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. జేపీ మోర్గన్, సిటీ బ్యాంక్, హెచ్ఎస్‌బీసీ, గోల్డ్‌మెన్‌సచేస్, మోర్గన్‌స్టాన్లే, హెచ్‌డీఎఫ్‌సీ, బంధన్‌బ్యాంక్, కోటక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లు మేళాలో పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం ఉదయం 10:30 గంటలలోపు కళాశాలలో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 93218 25562 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

88 దరఖాస్తులు

కామారెడ్డి రూరల్: కామారెడ్డి జిల్లాలోని మద్యం దుకాణాలకు శుక్రవారం నాటికి 88 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 49 దుకాణాలుండగా 5 ఎస్సీ, 2 ఎస్టీ, 7 గౌడ సామాజిక వర్గాలకు కేటాయించారు. ఓపెన్ కేటగిరి కింద 35 దుకాణాలున్నాయి. ఈ నెల 18 వరకు కొత్త టెండర్లకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఈ నెల 23న లక్కీ డ్రా నిర్వహిస్తామన్నారు. శుక్రవారం వచ్చిన 17 దరఖాస్తులతో కలిపి ఇప్పటి వరకు ఆయా దుకాణాలకు 88 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. వాటిలో కామారెడ్డి స్టేషన్ పరిధిలో 15 దుకాణాలకుగాను 24 దరఖాస్తులు వచ్చాయని, ఎల్లారెడ్డి స్టేషన్ పరిధిలో 7 దుకాణాలకు 7 దరఖాస్తులు, బాన్సువాడ స్టేషన్ పరిధిలో 9 దుకాణాలకు 21 దరఖాస్తులు, దోమకొండ స్టేషన్ పరిధిలో 8 దుకాణాలకు 11 దరఖాస్తులు, బిచ్కుంద స్టేషన్ పరిధిలో 10 దుకాణాలకు 25 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. రెండవ శనివారం సైతం యథావిధిగా దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు.

తేమశాతం అధికంగా ఉన్న ధాన్యాన్ని తూకం వేయవద్దు



ఎల్లారెడ్డిరూరల్: తేమశాతం అధికంగా ఉన్న ధాన్యాన్ని తూకం వేయవద్దని డీఆర్డీవో పీడీ సురేందర్ అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని మీసాన్‌పల్లి రైతువేదికలో శుక్రవారం ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్ మండలాల ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు సంబంధించిన ధాన్యం బాగా ఆరిన తరువాత కాంటా చేయాలని అన్నారు. ధాన్యంలో ఎలాంటి పొల్లు లేకుండా మిషన్ పట్టించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు ప్రసన్నరాణి, రాంనారాయణగౌడ్ తదితరులు ఉన్నారు.

మత్తు వదిలిస్తుండ్రు..

- మందుబాబులు డ్రంకన్ డ్రైవ్‌లో దొరికితే అంతే..
- జిల్లావ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు
- రెండు రోజుల్లోనే 100 మంది జైలుకు..

మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్లపైకి వస్తున్న మందుబాబుల మత్తును పోలీసులు వదిలిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా తరచూ డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపడుతూ మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పట్టుకొని, అరెస్టు చేస్తున్నారు. కోర్టులు సైతం వారికి రోజుల తరబడి జైలు శిక్షలు విధించడంతో పాటు, కమ్యూనిటీ శిక్షలు విధిస్తున్నాయి.



ఇటీవల జిల్లా కేంద్రంలో మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తిని పట్టణ పోలీసులు పట్టుకొని, కోర్టులో హాజరుపర్చారు. కోర్టు అతడికి ఒక రోజు కమ్యూనిటీ సర్వీస్ శిక్షను విధించింది. దీంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో 'నేను మద్యం తాగి వాహనం నడిపినందుకు కోర్టు నాకు ఒక రోజు కమ్యూనిటీ శిక్ష విధించిందనీ, మద్యం సేవించి వాహనం నడపవద్దని' ప్లకార్డు పట్టుకుని నిల్చున్నాడు.

నెల రోజుల క్రితం బిచ్కుంద పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. కోర్టు అతడికి 7 రోజుల జైలు శిక్ష విధించింది. సాధారణంగా ఒకటి లేదా రెండు రోజుల వరకే డ్రంకన్‌డ్రైవ్‌లో శిక్షలు పడుతుండడం చూస్తున్నాం. మార్పు రావడం లేదని గ్రహించిన కోర్టు నిందితుడికి 7 రోజుల శిక్ష విధించింది.

కామారెడ్డి క్రైం: జిల్లా పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ విషయంలో కొరడా ఝులిపిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేపడుతుండటంతో మద్యం తాగి వాహనాలు నడుతున్నవారు భారీగా పట్టుబడుతున్నారు. ఈక్రమంలో డ్రంకన్‌డ్రైవ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మరో వైపు కోర్టు శిక్షలు, జరిమానాలు విధించడం కూడా పెరుగుతున్నట్లు కనిపిస్తుంది.

జిల్లాలో 23 పోలీస్ స్టేషన్లు..

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 23 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. అన్ని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో నిత్యం వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యంగా డ్రంకన్‌డ్రైవ్‌పై పోలీస్ శాఖ ఫోకస్ చేస్తోంది. ప్రతినెల వేల సంఖ్యలో కేసులు జిల్లాలోని ఆయా కోర్టులకు వెళ్తున్నాయి. వాటిలో వందల సంఖ్యలో జైలు శిక్షలు పడుతున్నాయి. గత రెండు రోజుల వ్యవధిలోనే జిల్లాలోని ఆయా కోర్టుల పరిధిలో 100 మందికి జైలు శిక్షలు, జరిమానాలు విధించబడడమే ఇందుకు ఉదాహరణ. గత నెల 19న ఒకే రోజు 33 మందికి ఒకటి నుంచి రెండు రోజుల జైలు శిక్ష, జరిమానాలు పడ్డాయి. ఈనెల 9న జిల్లా వ్యాప్తంగా 58 మందికి జైలు శిక్షలు, జరిమానాలు విధించబడ్డాయి. తాజాగా శుక్రవారం జిల్లాలోని ఆయా కోర్టుల పరిధిలో డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 42 మందికి జైలు శిక్ష, జరిమానాలు విధించారు. పోలీసులు డ్రంకన్‌డ్రైవ్‌ను సీరియస్‌గా తీసుకుంటున్నారు. కాబట్టి వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపే విషయంలో అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఇటీవల కమ్యూనిటీ సర్వీస్ శిక్షకు గురై రోడ్డుపై ప్లకార్డుతో నిల్చున్న వ్యక్తి (ఫైల్)

ఉపేక్షించేది లేదు..



వాహనదారులు బాధ్యతగా వ్యవహరించాలి. మద్యం తాగి వాహనాలు నడపవద్దు. సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలి. డ్రంకన్‌డ్రైవ్ ప్రమాదకరం. దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నాం. తనిఖీలు నిత్యం కొనసాగుతాయి. ఎవరినీ ఉపేక్షించేది లేదు.
– రాజేశ్ చంద్ర, ఎస్పీ, కామారెడ్డి

అవగాహన కల్పిస్తున్నా..

మద్యం తాగి వాహనాలు నడపడం మంచిది కాదని పోలీసులు సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతగానో అవగాహన కల్పిస్తున్నప్పటికీ మందుబాబుల్లో మార్పు రావడం లేదు. డ్రంకన్‌డ్రైవ్ చేయకూడదని, విలువైన ప్రాణాలు పోగొట్టుకుని తమ కుటుంబాలను రోడ్డున పడేయవద్దని పోలీసులు సూచిస్తున్నారు. కానీ మందు బాబులు పోలీసుల సూచనలు పట్టించుకోవడం లేదు. ఈక్రమంలో పోలీసులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. తనిఖీలు మరింతగా పెంచుతామని, మద్యం సేవించి వాహనాలు నడిపితే సహించేది లేదని పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

ఉద్యానక్షేత్రంపై అంతులేని నిర్లక్ష్యం

- నిధులు, సిబ్బంది కొరతతో నిర్వహణకు ఆటంకం
- పట్టించుకునేవారు లేక పండ్ల తోటల్లో దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఒకప్పుడు వివిధ రకాల పండ్లతోటలతో, పూలమొక్కలతో కళకళలాడిన నాగిరెడ్డిపేట మండలంలోని మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రం ప్రస్తుతం పట్టించుకునేవారు లేక పిచ్చిమొక్కలతోపాటు గడ్డి దట్టంగా పెరిగి అధ్వానంగా మారింది. నిధుల కేటాయింపు లేకపోవడం, సిబ్బంది కొరత కారణంగా ఉద్యానక్షేత్రం నిర్వహణకు ఆటంకం ఏర్పడింది. గత నాలుగు నెలల వరకు కొనసాగిన మాల్తుమ్మెద ఉద్యానక్షేత్ర అధికారి బదిలీపై వెళ్లిపోయారు. దీంతో అప్పటి నుంచి పలువురు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నెట్టుకొస్తున్నారు. ఫలితంగా ఉద్యాన క్షేత్రంలోని పండ్లతోటలతోపాటు దారులు సైతం పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయాయి. పిచ్చిమొక్కలు, గడ్డి కారణంగా పండ్లచెట్ల ఎదుగులకు ఆటంకం కలుగుతుంది.

నిలిచిన మొక్కల ఉత్పత్తి..

ఉద్యానక్షేత్రంలో కొన్నిరోజులుగా మొక్కల ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. క్షేత్రంలోని నీటిలో సరైన పోషకాలు లేకపోవడం, నేలస్వభావం మొక్కల ఉత్పత్తికి అనుకూలంగా లేవని ఉద్యానశాఖ అధికారులు పేర్కొంటున్నారు. గతంలో ఉద్యానక్షేత్రం ఎదుట ఉన్న విత్తనోత్పత్తిక్షేత్రం నుంచి కొంతకాలం పాటు పైపుల ద్వారా నీటిని ఇక్కడికి తీసుకువచ్చి మొక్కలను ఉత్పత్తి చేసినప్పటికీ ప్రస్తుతం అది కూడ పూర్తిగా నిలిచిపోయింది.



మాల్తుమ్మెద ఉద్యానక్షేత్ర ముఖద్వారం

'ఉపాధి'తో తొలగింపునకు సిఫారసు..

ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యానక్షేత్రంలో దట్టంగా పెరిగిన పొదలను, పిచ్చిమొక్కలను తొలగింపజేసేందుకు ఉద్యానశాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. ఈమేరకు ఎన్ఆర్ఈజీఎస్‌కు అధికారులు లేఖ రాసినట్లు తెలిసింది. కూలీలతో కాకుండా కేవలం యంత్రాల సహాయంతో పొదల తొలగింపు చేపట్టే అవకాశం ఉంది.

అడవిపందుల బెడద..

దట్టంగా పెరిగిన పొదల్లో అడవిపందులు సహవాసం చేస్తున్నాయి. అడవిపందులు గుంపులు గుంపులుగా సంచరిస్తుండటంతో క్షేత్ర సిబ్బంది భయాందోళనకు గురిచేస్తున్నాయి. క్షేత్రంలోని దారుల వెంట వెళ్లాలంటేనే జంకే పరిస్థితి నెలకొంది. దీనికితోడు చిన్న నిప్పురవ్వ పడినా ఉద్యాన క్షేత్రం బుగ్గిపాలయ్యేలా గడ్డి, పొదలు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఉద్యానక్షేత్ర అభివృద్ధికి కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయిన ఉద్యానక్షేత్రంలోని దారులు

పొదలను తొలగింపజేస్తాం..

మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో కొత్త మొక్కల ఉత్పత్తి జరగకపోవడానికి కారణం నేలస్వభావం, నీటిలో నాణ్యత లేకపోవడమే. కాగా ఉద్యాన క్షేత్రంలో దట్టంగా పెరిగిన పొదల్లో అడవిపందులు సంచరిస్తున్నాయి. పెరిగిన పొదలను ఉపాధిహామీ పథకం ద్వారా తొలగింపజేసేందుకు ప్రయత్నం చేస్తున్నాం.
– జ్యోతి, జిల్లా ఉద్యానశాఖ అధికారిణి, కామారెడ్డి

స.హ. చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- జిల్లా అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ

కామారెడ్డి క్రైం: సమాచార హక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఆర్టీఐ-2005 వారోత్సవాల్లో భాగంగా అన్ని జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లోని పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి ఆర్టీఐ చట్టాన్ని తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. చట్టం లక్ష్యాన్ని నెరవేర్చేలా అన్ని కార్యాలయాల పీఐవోలు ప్రజలు అడిగిన సమాచారాన్ని ఎలాంటి దాపరికం లేకుండా నిర్ణీత సమయంలోగా, నిర్ణీత పద్ధతిలో అందించాలన్నారు. అనంతరం ఆర్టీఐ చట్టాన్ని మార్గదర్శకాల ప్రకారం అమలు చేస్తామని అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్ నాయక్, డీఆర్వో మధుమోహన్, ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి, ట్రెయినీ కలెక్టర్ రవితేజ, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు పీఐవోలు తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి కలెక్టరేట్‌లో ఆర్టీఐ చట్టం అమలుపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కమీషన్.. పరేషాన్..

- రేషన్ డీలర్లకు ఆరు నెలలుగా అందని వైనం
- జిల్లాలో సుమారు రూ.5కోట్లకు పైగా బకాయిలు

ఎల్లారెడ్డి: రేషన్ డీలర్లకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన కమీషన్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల వారు పరేషాన్ అవుతున్నారు. నెలల తరబడి కమీషన్ డబ్బులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దుకాణాల అద్దెలు సైతం కట్టలేకపోతున్నామని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కమీషన్ చెల్లింపులు ఆలస్యం కావడంతో డీలర్లు నిరసన కూడా తెలిపారు.

జాడలేని కాంగ్రెస్ హామీ..

నెలల తరబడి కమీషన్ డబ్బులు రాకపోవడంతో రేషన్ దుకాణాల అద్దెలు సైతం కట్టలేక డీలర్లు ఇబ్బంది పడుతున్నారు. దుకాణపు అద్దె నెలకు రూ. 5వేలు, తూకం వేసే సహాయకుడికి రూ.3వేలు, హమాలీ కూలీకి రూ.వెయ్యి ప్రతీ నెలా కమీషన్ వచ్చినా రాకపోయినా డీలర్ చెల్లించక తప్పడం లేదు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.140 కమీషన్‌ను రూ.3000లకు పెంచుతామని హామీ ఇచ్చారు. కానీ పార్టీ అధికారంలోకి వచ్చాక మర్చిపోయారని డీలర్లు విమర్శిస్తున్నారు. కేరళ, తమిళనాడు తరహాలో మన రాష్ట్రంలో కూడా డీలర్లకు కమీషన్‌తోపాటు గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం డీలర్లు ఇటీవల ఆందోళన బాట పట్టారు. కానీ కొత్తగా పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన స్టీఫెన్ రవీంద్ర వారి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడంతో ఆందోళన వాయిదా వేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు కమీషన్ బకాయిలను వెంటనే చెల్లించాలని జిల్లాలోని డీలర్లు కోరుతున్నారు.



లింగారెడ్డిపేటలో రేషన్ లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న రేషన్ డీలర్ (ఫైల్)

జిల్లాలో 578 దుకాణాలు..

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 578 రేషన్ దుకాణాలుండగా 2,88,553 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీటిలో 17,827 మంది అంత్యోదయ, 869 అన్నపూర్ణ, 2,69,898 మంది ఆహార భద్రత కార్డులు కలిగి ఉన్నారు. 578 రేషన్ దుకాణాలకు గాను సగటున ప్రతీ దుకాణం ద్వారా 100 క్వింటాళ్ల బియ్యం పంపిణీ చేస్తున్నారు. డీలర్లు బియ్యం పంపిణీ చేసినందుకు గాను ప్రతీ క్వింటాలుకు రూ.140 కమీషన్‌ను ప్రభుత్వ చెల్లిస్తుంది. ఇందులో రూ.95 కేంద్ర ప్రభుత్వం ద్వారా, రూ.45 రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చెల్లిస్తారు. ఈ కమీషన్‌లలో రాష్ట్ర ప్రభుత్వ కమీషన్ ఒక నెల బకాయి ఉండగా, కేంద్ర ప్రభుత్వ కమీషన్ ఆరు నెలల నుంచి చెల్లించడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.5 కోట్లకు పైగా కమీషన్ బకాయిలు డీలర్లకు రావాల్సిఉందని సమాచారం.

నిర్వహణ ఇబ్బందిగా మారింది..



జిల్లా వ్యాప్తంగా ఉన్న 578 మంది రేషన్ డీలర్లకు ఆరు నెలలుగా కమీషన్ డబ్బులు రావడం లేదు. జిల్లాలోని ప్రతీ రేషన్ డీలరుకు దాదాపు రూ.10 వేల వరకు బకాయిలు రావాల్సి ఉన్నాయి. దీంతో డీలర్లకు రేషన్ షాపు నిర్వహణ ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణం బకాయిలు చెల్లించి ఆదుకోవాలి.
– నాగం సురేందర్, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎల్లారెడ్డి

నత్తనడకన హైవే బ్రిడ్జి మరమ్మతులు

- గాయత్రి షుగర్స్ వద్ద వంతెనపై నిలిపివేసిన రాకపోకలు
- సర్వీస్ రోడ్డుపై వాహనాల మళ్లింపు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి పరిధిలోగల గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ వద్ద 44వ జాతీయ రహదారి బ్రిడ్జి మరమ్మతులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో కొన్ని రోజులుగా వాహనాలను సర్వీస్ రోడ్డు గుండా మళ్లించడంతో తరచు ట్రాఫిక్ జామ్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతకుముందు కొన్ని రోజుల పాటు మర్కల్ చౌరస్తా నుంచి అడ్లూర్ ఎల్లారెడ్డి వరకు వన్‌వేపై వాహనాలను మళ్లించారు. ఇప్పుడేమో బ్రిడ్జిపై మరమ్మతుల పేరిట సర్వీస్ రోడ్డు గుండా వాహనాలను పంపించడం వల్ల వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. నిజామాబాద్‌వైపు నుంచి హైదరాబాద్ వైపునకు రాత్రి వేళలో ప్రయాణం సాగించే వారికి ట్రాఫిక్ జామ్ కావడం వల్ల గంటల తరబడి అంతరాయం ఏర్పడుతోంది. ఈ రహదారి గుండా ప్రతిరోజు వందలాది సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. బ్రిడ్జిపై మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేసి వాహనదారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉంది. ఇప్పటికైనా ప్రమాదాలు సంభవించకముందే అధికారులు దృష్టిసారించి మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలని వాహనదారులు కోరుతున్నారు.



అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ వద్ద సర్వీస్ రోడ్డు గుండా వెళుతున్న వాహనాలు



గాయత్రి షుగర్స్ వద్ద హైవే బ్రిడ్జిపై కొనసాగుతున్న మరమ్మతులు

ఎమ్మెల్యే భూపతి రెడ్డికి సీఎం పరామర్శ

- 'ద్వాదశ దినకర్మ'కు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి సీతక్క, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, నేతలు

సుభాష్‌నగర్: నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిని శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు పరామర్శించారు. నగరశివారులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన భూపతిరెడ్డి మాతృమూర్తి రేకులపల్లి లక్ష్మీనర్సమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి హాజరై చిత్ర పటానికి నివాళులు అర్పించారు. భూపతిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపాన్ని తెలియజేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు తాహెర్ బిన్ హందాన్, ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జులు వినయ్‌రెడ్డి, పోచారం భాస్కర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నగేష్‌రెడ్డి, ఈగ గంగారెడ్డి, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, మునిపల్లి సాయిరెడ్డి, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎంకు స్వాగతం పలికిన కలెక్టర్, సీపీ

సీఎం రేవంత్‌రెడ్డికి కలెక్టరేట్‌లో హెలీప్యాడ్ వద్ద కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య జిల్లా అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

క్లుప్తంగా

సోయా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



మద్నూర్(జుక్కల్):సోయా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ మండల రైతులు తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ నాయకులు, రైతులు ఉన్నారు.

ఇసన్నపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ కార్యవర్గం ఎన్నిక

రామారెడ్డి: మండలంలోని ఇసన్నపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. గ్రామ అధ్యక్షుడిగా గొల్ల బైరుయాదవ్, ఉపాధ్యక్షుడిగా దోమకొండ రాజు యాదవ్, జనరల్ సెక్రెటరీగా మాదాస్ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉమెంతులు లక్ష్మారెడ్డి, కోశాధికారిగా కుర్రి శంకర్, బీసీ సెల్ అధ్యక్షుడిగా చింతల రవీందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఎర్ర శ్రీనివాస్, సలహాదారులుగా బచ్చ సుధాకర్, దోకి లచ్చయ్య ఎన్నికయ్యారు.

కంప్యూటర్ వితరణ



గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బొంపల్లి భవాని పాఠశాలకు కంప్యూటర్‌ను శుక్రవారం వితరణ చేశారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన ఆమె గత నెలలో సీఎం చేతుల మీదుగ ప్రశంసాపత్రంతో పాటు రూ. పదివేల నగదు పురస్కారం అందుకున్నారు. నగదు పురస్కారంతో పాటు ఆమె మరికొంత నగదు వెచ్చించి పాఠశాలకు కంప్యూటర్‌ను అందించారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ

నిజాంసాగర్(జుక్కల్): అనారోగ్యంతో హైదరాబా ద్‌లో చికిత్స పొందుతున్న నిజాంసాగర్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గౌరై కృష్ణారెడ్డిని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు శుక్రవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే వైదుల్యకు సూచించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

మల్లుపల్లిలో బీఆర్ఎస్ నేతకు..

భిక్కనూరు: మండలంలోని మల్లుపల్లి బీఆర్ఎస్ నేత పల్లపు శంకర్‌ను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ శుక్రవారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం శంకర్ తండ్రి ముత్తయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నేత లు అందె మహేందర్‌రెడ్డి, తున్కి వేణు ఉన్నారు.

అనారోగ్యంతో న్యాయవాది మృతి



శ్రీనివాస్(ఫైల్)

బిచ్కుంద: బిచ్కుంద కోర్టులో విధులు నిర్వహిస్తున్న సీనియర్ న్యాయవాది శ్రీనివాస్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్ర వారం మృతి చెందారు. బిచ్కుంద బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయ వాది శ్రీనివాస్‌కు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. న్యాయవాదులు లక్ష్మణ్‌రావు, మల్లేశ్వర్, విఠల్, ప్రకాశ్, శివాజీ, మహ్మద్ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు, నేతల స్వాగతం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం నగరంలో పర్యటించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తల్లి లక్ష్మీనర్సమ్మ దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్ వద్ద జిల్లాకు చెందిన అధికారులు, కాంగ్రెస్ నేతలు, నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సీఎం, చిత్రంలో పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, సలహాదారు షబ్బీర్ అలీ

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

- విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఎరుకల నారాయణ

రామారెడ్డి: విద్యుత్ సమస్యల పరిష్కారంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఎరుకల నారాయణ అన్నారు. రామారెడ్డి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేశారు. ఈ వేదిక ద్వారా ఆయన వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ప్రతి సోమవారం సబ్‌స్టేషన్‌లో ప్రజావాణి నిర్వహిస్తున్నా వినియోగదారుల నుంచి 20 ఫిర్యాదులు రావడంపై చైర్‌పర్సన్ నారాయణ ఏఈ నరసింహపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను సీఎండీ దృష్టికి తీసుకెళ్తానని సిబ్బందిని హెచ్చరించారు. విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ప్రజలకు ఎందుకు సమాచారం అందించలేదని, వేదికలో మైక్‌ను ఎందుకు ఏర్పాటు చేయలేదని ఏఈని నిలదీశారు. రామారెడ్డి జూనియర్ కళాశాల వద్ద 11 కేవీ వైర్లను వెంటనే ఎత్తుకు పెంచాలని ఎస్ఈ శ్రావణ్ కుమార్‌ను ఆదేశించారు. రైతులు తమ సమస్యలను విద్యుత్ అధికారులు పరిష్కరించడం లేదని చైర్‌పర్సన్‌కు విన్నవించారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి విద్యుత్ సమస్యలపై పరిష్కార వేదిక ఏర్పాటు చేస్తామని అన్నారు. అప్పటిలోగా వినియోగదారులు చేసిన ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను చైర్‌పర్సన్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో రామారెడ్డి ఏఈ నరసింహ, మూడు మండలాల ఏఈలు పాల్గొన్నారు.



అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న రైతులు

జీఎస్టీ తగ్గించట్లేదా.. ఫిర్యాదు చేయండి

మీ కోసం..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): కేంద్రం వస్తు సేవల పన్నులో కొన్ని స్లాబ్‌లను ఎత్తివేసింది. కొన్ని వస్తువులకు పన్ను తగ్గించింది. తగ్గించిన ధరల మేరకు వినియోగదారులకు వస్తు సేవలు లభిస్తున్నాయా లేదా అనే అంశంపై కేంద్ర ప్రభు త్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి వినియోగదారుల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు 1915 టోల్‌ఫ్రీ నంబర్, వాట్సాప్ 8800001915 నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. వ్యాపారులు తగ్గింపు ధరలను అమలు చేయకుంటే ఈ నెంబర్లలో ఫిర్యాదు చే యొచ్చు.ఈ కామర్స్ సంస్థలు సైతం తగ్గిన వ స్తు సేవల పన్ను విధానం మేరకు సరుకులు అందించకపోతే ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించింది.

ఉత్సవాలకు ముస్తాబైన చాముండేశ్వరి ఆలయం

- అమ్మవారిని ప్రతిష్ఠించి నేటికి 54 ఏళ్లు పూర్తి
- అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు



ఆలయంలోని అమ్మవారి విగ్రహం



దోమకొండలోని చాముండేశ్వరి ఆలయం

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయం నేటి నుంచి నిర్వహించే ఉత్సవాలకు ముస్తాబైంది. రాష్ట్రంలో సికింద్రాబాద్ తర్వాత అతిపెద్ద మహంకాళి ఆలయంగా పేరుగాంచిన ఈ ఆలయ నిర్మాణం చేపట్టి నేటితో 54 ఏళ్లు పూర్తవుతోంది. ఈ ఆలయాన్ని మహంకాళి, చాముండేశ్వరి ఆలయంగా పిలుస్తుంటారు. కాళిక, దుర్గా, చాముండి మాతగా భక్తులకు దర్శనమిచ్చే చాముండేశ్వరి అమ్మవారు కార్యాలను విజయవంతం చేస్తుందని ప్రతీతి. కాగా పూర్వం మహిషాసురుడు అనే రాక్షసుడు కఠోర తపస్సుతో పురుషుల చేతిలో మరణించకూడదని పరమేశ్వరుని నుంచి వరం పొందాడు. ఆ వరం పొందిన గర్వంతో సకల లోకాలను పీడించాడు. భయభ్రాంతులైన సకల లోకవాసులు త్రిమూర్తులను వేడుకోగా, మహిషాసురుడిని మదించేందుకు ఒక స్త్రీ శక్తిని సృష్టిస్తారు. ఆ శక్తి స్వరూపిణియే చాముండేశ్వరి మాతగా చరిత్రలో నిలిచిపోయింది.

ఆలయ చారిత్రక నేపథ్యం..

దోమకొండ సంస్థానానికి చెందిన కామినేని వంశీయులు ఈ ఆలయాన్ని నిర్మించారు. 1943–1946 మధ్య కాలంలో ఆలయాన్ని నిర్మించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. ఆలయంలోని అమ్మవారి ప్రతిమ రాక్షసులను సంహరించే రూపంలో ఉండి భక్తులకు దర్శనమిస్తుంది. అమ్మవారికి ఉన్న 18 చేతుల్లో ప్రతి చేతిలో ఒక ఆయుధం కలిగి ఉండటం విశేషం.

ఆలయంలో నేటి కార్యక్రమాలు

ఆలయంలో ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులు అమ్మవారికి అభిషేకాలు చేపట్టి ఒడిబియ్యం పోయనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. సాయంత్రం అమ్మవారి విగ్రహాల ఊరేగింపు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

భక్తుల కోరికలు తీర్చే అమ్మవారు



భక్తులు కోరిన కోరికలు తీర్చే అమ్మవారుగా చాముండేశ్వరి అమ్మవారు పేరుగాంచింది. యాభై మూడేళ్లుగా అమ్మవారి కి బోనాలు, శరన్నవరాత్రి ఉత్సవాలు, వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మెదక్, నిజామాబాద్, సిరిసిల్లా, సిద్దిపేట, హైదరాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

– భావి శరత్‌చంద్రశర్మ, ఆలయ అర్చకులు, దోమకొండ

అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణం

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- అట్టహాసంగా ప్రారంభమైన ఎస్జీఎఫ్ అండర్–14 తైక్వాండో టోర్నీ



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్ నాగారం: జిల్లా కేంద్రంలో సరైన మైదానాలు లేకపోయినప్పటికీ ప్రతిభచాటుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడం క్రీడాకారుల గొప్పతనమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్–14 తైక్వాండో టోర్నీని ఎమ్మెల్యే ధన్‌పాల్ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ గ్రామీణస్థాయి క్రీడాకారులను ప్రోత్సహిస్తుంటే, రాష్ట్రంలో మాత్రం గత ప్రభుత్వం క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించకపోవడం దురదృష్టకరమన్నారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేకంగా ఓ క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించినప్పటికీ ప్రభుత్వం కేటాయించకపోవడం దారుణమన్నారు. జిల్లాలో క్రీడా మైదానం ఏర్పాటు కోసం వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగమణి, డీవైఎస్‌వో పవన్ కుమార్, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, పేట సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, గోపి రెడ్డి, మల్లేశ్ గౌడ్, డీసీసీబీ సెక్రెటరీ సీతయ్య, తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అజ్మత్, కార్యదర్శి వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు వ్యవస్థను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాచార హక్కు వ్యవస్థను బలోపేతం చేయాలనే సంకల్పంతో స.హ. చట్టం–2005ను ప్రవేశపెట్టాయని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి అన్నారు. తెయూ సమాచార హక్కు సహాయాధికారి డాక్టర్ నీలిమా అధ్యక్షతన 'సమాచార హక్కు చట్టం–2005' పై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు రిజిస్ట్రార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల సహకారం, భాగస్వామ్యంతోనే వ్యవస్థలు ప్రగతి పూర్వకంగా ముందుకు పోతాయన్నారు. పౌర సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని పారదర్శకంగా అందించాలన్నారు. దేశ సమగ్రతకు భంగం కలిగించే సమాచారాన్ని గోప్యంగా ఉంచాలన్నారు. వర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ కే ప్రసన్న రాణి మాట్లాడుతూ సమాచారం అడగడం పౌరుల ప్రధానహక్కుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్ మామిడాల, కంట్రోలర్ ప్రొఫెసర్ సంపత్ కుమార్, యూజీసీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్ ఆంజనేయులు, సమాచార కేంద్రం జూనియర్ అసిస్టెంట్ హరీశ్, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగ సొత్తును కొనుగోలు చేసిన ఒకరికి 6 నెలలు జైలు

కామారెడ్డి క్రైం: మహిళకు మాయమాటలు చెప్పి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లిన కేసులో ప్రధాన నిందితుడు మృతి చెందగా, బంగారాన్ని కొనుగోలు చేసిన మరో నిందితునికి 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ బిచ్కుంద కోర్టు శుక్రవారం తీర్పునిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2020 జూలై 17న బిచ్కుందకు చెందిన ఈడెం పోచవ్వ అనే వృద్ధురాలు దుకాణానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి అటకాయించాడు. బ్యాంకులో పింఛన్ డబ్బులు ఇప్పిస్తానంటూ నమ్మించి ఆమె మెడలోని తులం బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని పెద్ద ఏడ్గి గ్రామానికి చెందిన దిగంబర్‌గా గుర్తించారు. అతడు కాజేసిన బంగారం గొలుసును కొనుగోలు చేసినందుకు తుకారాంపై కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు దిగంబర్ చనిపోగా, దొంగ సొత్తును కొనుగోలు చేసిన తుకారాంకు 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ తీర్పునిచ్చారు. పీపీ రాజేశ్ గౌడ్, ఎస్సైలు సాయన్న, మోహన్ రెడ్డి, సిబ్బందిని ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు.

హత్య కేసులో ఏడుగురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విఠల్‌రెడ్డి

మద్నూర్(జుక్కల్): యువకుడి హ త్య కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి, బి చ్కుంద సీఐ రవికుమార్, ఎస్సై విజయ్‌కొండ వివరాలు వెల్లడించారు. సోమూర్ గ్రా మానికి చెందిన రాజ్‌కుమార్, భీంరావ్, తేజరావ్, సూర్యకాంత్, పండిత్‌రావ్, రాచప్ప, హన్మంత్, రామ్‌నాథ్ వరుసకు అన్నదమ్ములు. గత నెల 28న భీంరావ్‌కు రాజ్‌కుమార్ డబ్బులు బాకీ ఉండగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. డబ్బులు తక్కువ చెల్లిస్తున్నావని భీంరావ్ రాజ్‌కుమార్‌ను ప్రశ్నించాడు. దీంతో రాజ్‌కుమార్ భీంరావ్‌ను దుర్భాషలాడాడు. భీంరావ్‌తోపాటు తేజరావు, సూర్యకాంత్, పండిత్‌రావ్, రాచప్ప, రామ్‌నాథ్, హన్మంతులు కలిసి రాజ్‌కుమార్‌పై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. రాజ్‌కుమార్‌ను స్థానికులు నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 6న మృతి చెందాడు. మృతుడి తండ్రి బస్వంత్ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



ప్రకాశ్ (ఫైల్)

ఎల్లారెడ్డి: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు పోతుల ప్రకాశ్ గురువారం రాత్రి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మెదక్ జిల్లా ఏడుపాయల నుంచి ఎల్లారెడ్డికి బైక్‌పై వస్తున్న ప్రకాశ్ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మెదక్‌కు తరలించగా గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అట్రాసిటీ కేసులో ఏడుగురిపై కేసు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సంతాయిపేట్ గ్రామానికి చెందిన ఏడుగురిపై అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్సై మురళి తెలిపారు.గత నెల 30న సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా వృత్తిరీత్యా మాదిగ వారు డప్పులు కొట్టినందుకు రూ.20 నుంచి రూ.50 వరకు ఇస్తారు. గ్రామస్తులందరూ డబ్బులు ఇవ్వగా, గ్రామానికి చెందిన వడ్ల నరేందర్ అనే వ్యక్తి డబ్బులను ఇవ్వలేదు.కాగా ఈ నెల 5న ఒకరి అంత్యక్రియల్లో కనిపించిన నరేందర్‌ను మద్దికుంట పాపయ్య డబ్బులు అడిగాడు. పది మందిలో తననే డబ్బులు అడుగుతావా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ నరేందర్‌తోపాటు మరో ఆరుగురు పాపయ్యను అసభ్యపదజాలంతో దూషిస్తూ కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వడ్ల నరేందర్,వడ్ల రాజు,కుమ్మరి కిష్టయ్య, కుమ్మరి నర్సింహులు, కుమ్మరి సంజీవులు, ముంజ నర్సయ్య, సుతారి వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

క్రైం కార్నర్

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి



రాములు మృతదేహం

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన వడ్ల రాములు(48) గ్రామ ఊర చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఎస్సై రజనీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. రాములు గ్రామంలో వడ్రంగి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అప్పుడప్పుడు మానసిక పరిస్థితి బాగోలేక పోవడంతో ఆందోళనగా తిరిగేవాడు. ఈ క్రమంలో చెరువు వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. శనివారం నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్ట్

ఖలీల్‌వాడి: చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మంచిర్యాలకు చెందిన పాత నేరస్తుడు షేక్ యూనుస్ మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు వచ్చిన సమాచారంతో శుక్రవారం అక్కడికి వెళ్లి అరెస్టు చేశామన్నారు. కృష్ణ, పండరీపూర్ రైలులో నిందితుడు చోరీకి పాల్పడ్డాడన్నారు. నిందితుడి నుంచి రెండు ఫోన్లు, రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై రెండు కేసులు ఉన్నట్లు నిర్ధారించి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. రైల్వే ఐడీ పార్టీ పోలీసులు హనుమాన్ గౌడ్, సురేందర్ గురుదాస్ ఉన్నారు.

దుబాయ్‌లో అపస్మారకస్థితిలో జిల్లా వాసి

- ఆస్పత్రిలో చేర్పించిన ఎయిర్‌పోర్టు సిబ్బంది

నిజామాబాద్‌అర్బన్: దుబాయి ఎయిర్‌పోర్ట్‌లో నిజామాబాద్ నగరానికి చెందిన సయ్యద్ బాబా (38) అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 3న సయ్యద్ బాబా ముంబై నుంచి సౌదీ అరేబియాలోని అభా నగరానికి వెళుతూ దుబాయ్ ఎయిర్‌పోర్టులో మరో విమానం ఎక్కాల్సి ఉండగా, అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. స్పందించిన ఎయిర్‌పోర్ట్ సిబ్బంది సయ్యద్ బాబాను రషీద్ హాస్పిటల్‌లో చేర్పించి మానవత్వం చాటారు. అస్వస్థతకు మత్తు కారణమై ఉండొచ్చని అనుమానిస్తున్నారు. కాగా, అతడిని ఇండియాకు తిరిగి రప్పించాలని భార్య సమీనా బేగం హైదరాబాద్ ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఎమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరం ప్రధాన కార్యదర్శి బీఎల్ సురేంద్రనాథ్ వారికి మార్గదర్శనం చేశారు. దుబాయిలో ఉన్న జిల్లావాసులు నయీం, కొట్టాల సత్యం, నారాగౌడ్ రోగి బాగోగులు చూసుకుంటున్నారని కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యార్థినుల అదృశ్యం కథ సుఖాంతం

- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం నుంచి బుధవారం అదృశ్యమైన ముగ్గురు విద్యార్థినులను పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం వారి తల్లిదండ్రులకు అప్పగించారు. బుధవారం ఉదయం తొమ్మిది, పదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ఎవరికీ సమాచారం అందించకుండా హాస్టల్ నుంచి బయటకు వెళ్లారు. ఓ విద్యార్థినికి పరిచయం ఉన్న వ్యక్తితో వీరు నిజామాబాద్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడి నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు వెళ్లిపోయారు. ఓ విద్యార్థిని నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లోనే రైలు ఎక్కకుండా దిగిపోయింది. ఇద్దరు విద్యార్థినులు మాత్రం పరిచయం ఉన్న వ్యక్తితో వెళ్లారు. తల్లిదండ్రులు, తోటి విద్యార్థినుల వద్ద సమాచారాన్ని సేకరించిన పోలీసులు విద్యార్థినికి పరిచయం ఉన్న వ్యక్తి ఫోన్‌ను ట్రేస్ చేశారు. దీంతో వీరు హైదరాబాద్‌కు వెళుతున్నట్లు గుర్తించారు. కాచిగూడ రైల్వే పోలీసులకు సమాచారం అందించగా వారు ఇద్దరు విద్యార్థులతోపాటు మరో వ్యక్తిని పట్టుకున్నారు. రెండో టౌన్ పోలీసులు కాచిగూడ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి వారిని తీసుకొచ్చారు. దీంతో అదృశ్యం ఘటన సుఖాంతమైంది. కాగా, విద్యార్థినులతో వెళ్లిన వ్యక్తిపై కేసు నమోదు కాలేదు. విద్యార్థినులే అతన్ని తీసుకొని హైదరాబాద్‌కు వెళ్లినట్లు విచారణలో తేలింది. అతనిపై ఫిర్యాదు ఇవ్వకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు.

విద్యుత్ వైరు చోరీ

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ డివిజన్ శివారులో గల ఓ వెంచర్‌లో 15 స్తంభాలకు వచ్చే విద్యుత్ తీగ గురువారం రాత్రి చోరీకి గురైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో తెలిపారు. వెంచర్ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీరు సీసాతో ఆర్టీసీ బస్సుపై దాడి



ఆలూర్‌లో రోడ్డుపై బైఠాయించిన ప్రయాణికులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం ఆలూర్ గ్రామంలో ఓ యువకుడు మద్యం మత్తులో ఆర్టీసీ బస్సుపై బీరు సీసాతో దాడి చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం రాత్రి ఆర్మూర్ డిపోకు చెందిన బస్సు ఆలూర్ మీదుగా నందిపేట్ వెళ్తుండగా ఆలూర్ గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాన్(ప్రవీణ్) అనే యువకుడు బైక్‌ను ఇష్టానుసారంగా నడుపుతుండడంతో డ్రైవర్ శ్రీరాములు హారన్ కొట్టాడు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేస్తూ జాన్ బీరు సీసాతో బస్సుపై దాడి చేశాడు. అనంతరం బస్సులోకి ప్రవేశించి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. బీరు సీసాతో బస్సు డ్రైవర్‌ను చంపాలని ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. అదే సమయంలో వార్త సేకరణకు వెళ్లిన ఓ రిపోర్టర్‌ను సైతం జాన్ బెదిరించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగానే జాన్ అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో ప్రయాణికులు రోడ్డుపై బైఠాయించి జాన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్సు డ్రైవర్, రిపోర్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దేవునిపల్లిలో భారీ చోరీ

- రూ.2.5 లక్షల నగదు, 3.5 తులాల బంగారం, 50 తులాల వెండి అపహరణ



విచారణ జరుపుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం: తాళం వేసి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి వచ్చేలోపే దుండగులు ఇళ్లు గుల్ల చేశారు. ఈ ఘటన జిల్లా కేంద్రంలోని దేవునిపల్లిలో శుక్రవారం వేకువజామున చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. దేవునిపల్లిలోని భూమొల్ల శ్రీశైలం బీడీ కంపెనీ వర్కర్‌గా పని చేస్తున్నాడు. గాంధీనగర్ కాలనీలో బంధువుల పెళ్లి ఉండటంతో గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కుటుంబంతో కలిసి వెళ్లారు. శ్రీశైలం తిరిగి శుక్రవారం వేకువ జామున 5 గంటలకే వచ్చాడు. అప్పటికే తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో సామాన్లు, బీరువా చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఇంట్లో దాచిన రూ.2.5 లక్షల నగదు, 3.5 తులాల బంగారం, 50 తులాల వెండి అపహరణకు గురైనట్లు బాధితుడు శ్రీశైలం వాపోయాడు. కాగా, పక్కనే ఉన్న మరో ఇంట్లో సైతం దొంగలు చొరబడి చోరీకి యత్నించారు. ఆ ఇంట్లో విలువైన వస్తువులు లేక పోవడంతో వెళ్లిపోయారు.

తాళం వేసిన ఇంట్లో ..



దుండగులు తెరిచిన బీరువా

నవీపేట: మండలంలోని యంచ గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గురువారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన బేగరి జ్యోతి జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో నైట్ డ్యూటీ చేసి శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చింది. ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడటంతో బీరువా తెరిచి ఉంది. అందులోని ఒకటిన్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 48 వేల నగదును దుండగులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.